


# ఎల-వెన్నెల

— విహారి

**బదిలీ అయి** ఈ వూరొచ్చిన కొత్తలో— ఒకరోజు క్లబ్‌లో మాట్లాడటానికి వెళ్ళేను.

క్లబ్ కార్యదర్శి రాజారావుగారు. ఆఫీసులో ఒక మిత్రుడి ద్వారా ఆయన నాకు పరిచయమైనారు. "సాహిత్యంలో ఏదో ఒక అంశం గురించి మీరీ వారం మాట్లాడాలి" అని కోరితే కాదనలేక ఒప్పుకున్నాను.

టిఫిన్, కాఫీలు అయినాయి.

సమావేశాన్ని ప్రారంభించడానికి ఎందుకో ఆలస్యమవుతున్నట్టు గమనించాను. రాజారావుగారు హడావిడిగా అటూ ఇటూ తిరుగుతున్నారు. నేను పక్కగా ఒక కుర్చీలో కూర్చున్నాను. గోడలకు వ్రేలాడుతున్న ఫొటోల కేసి చూడసాగేను.

రాజారావుగారు నా దగ్గరగా వచ్చి చెప్పేరు— "మా ప్రెసిడెంటుగారు రావడమే కొంచెం ఆలస్యమైంది. వచ్చేస్తున్నట్టు ఫోన్ చేశారు. జస్ట్, కొద్దిసేపట్లో కార్యక్రమం మొదలెట్టేద్దాం." జాప్యానికి ఏమీ అనుకోవద్దనే వేడికోలు !

మరి కొంతసేపటికి అధ్యక్షుల్నీ, నన్నూ వేదికమీదికి ఆహ్వానించేరు రాజారావుగారు. ముందు వరసలో కూర్చున్న ఒక ఇద్దరు సిల్కు లాల్చీ లేచి వేదిక నెక్కింది. నేనూ వెళ్ళేను.

నా ప్రక్క కుర్చీలోని అధ్యక్షుణ్ణి చూసి విస్తుపోయాను.

రామ్మూర్తి !

రామ్మూర్తి— ఇలాంటి సర్వీస్ క్లబ్‌కి ప్రెసిడెంట్ ! రెప్పపాటు లేకపోవడం అంటే ఏమిటో తెలిసింది నాకు.

నాతో కరచాలనం చేస్తుండగానే నన్ను గుర్తుపట్టేడు రామ్మూర్తి. అతని కళ్ళు మెరిసినాయి.

అతని మెడలో బంగారపు గొలుసు పచ్చపచ్చగా మెరిసింది.

అతని ఉంగరాల్లోని వజ్రాలు దానిమ్మగింజల్లా మెరిశాయి.

అతని వాచీ గొలుసు వక్షస్త కాగితం పట్టిన పచ్చి పసుపులా మెరిసింది.

తన ఆలస్యానికి చాలా చాలా నొచ్చుకున్నాడు రామ్మూర్తి. నా గురించి మంచి తొలిపలుకులు పలికేడు. నన్నిలా కలుసుకునే అవకాశం కల్పించిన రాజారావుగారికి ధన్యవాదాలు చెప్పేడు.

కార్యక్రమం ముగిసింది.

నా చెయ్యి పుచ్చుకుని నడిపిస్తూ చాలా హడావిడిగా బయటికి వచ్చాడు రామ్మూర్తి. కారెక్కబోతూ అన్నాడు—"కంపెనీ మీటింగుంది. వెరీ సారీ, రాజా. వెంటనే వెళ్ళాలి. ఇదిగో నా అడ్రెస్. ఆల్వేస్ వెల్‌కమ్. అయితే చిన్న రిక్వెస్ట్. వచ్చే ముందు ఫోన్ చేస్తే నాకు మరికొంత వీలుగా ఉంటుంది."

అతను నా చేతిలో విజిటింగ్ కార్డ్‌ని ఉంచేడు. తీసుకున్నాను. రామ్మూర్తి కారులో కూర్చున్నాడు. "మళ్ళీ కలుద్దాం" అంటూ చెయ్యి వూపేడు.

కారు వెళ్ళిపోయింది.

ఏదో స్వప్నంలో నుంచి తేరుకున్నట్టయింది నా పరిస్థితి.

రాజారావుగారి దగ్గర సెలవు తీసుకుని నెమ్మదిగా కదిలేను. ఇంటికి వచ్చేవరకు మాటే నాకు అంతా సందిగ్ధంగానే ఉంది.

ఆ రాత్రి— నాకు సరిగా నిద్రలేదు. రామ్మూర్తి గురించిన ఆలోచనతోనే సరిపోయింది. సినిమా హీరో జీవితంలా తోచింది రామ్మూర్తి జీవితం. హఠాత్తుగా ఒక సందేహమూ కలిగింది— 'రామ్మూర్తికి ఏ లాటరీయో తగిలిందా?!' అని.

కళ్ళముందు గతం జలజలారు తెర జారింది.

బందరులో పంతులుగారి మేడకు దగ్గరగా ఉండేది రామ్మూర్తి వాళ్ళ ఇల్లు. న్యాయానికి దాన్ని ఇల్లు అనడం అన్యాయమే అవుతుంది. చూర్లు దిగిపోయిన ఒంటినిట్టాడి కొంప. పెంకులు రాలిపోయి ఉండేవి. సూర్య చంద్రులు రాకపోకలకి సందులు చేసు కూర్చున్నారు ఆ కొంపలోకి. గోడలు చవుడు రాలిపోయి, రాళ్ళు వూడిపోతూ ఉండేవి. నిట్టాడికి తాతలనాటి ఉట్టి ఒకటి ఉండేది. ఒక మూలగా గూటదీపం. ఆ కొంపలో ఒక ముసల్ది ఉండేది. ఆమెని రామ్మూర్తి 'మా అవ్వ' అనేవాడు. దుర్గామహల్ పక్కగా గోలీలాడుకునే రోజుల్లో మాలో వచ్చి కలిశాడు రామ్మూర్తి. ఆ తర్వాత కొద్ది రోజుల్లోనే ఆ 'అవ్వ' పోయింది. అప్పట్నుంచీ రామ్మూర్తి

వీధిన పడ్డాడు. వారాల రామ్మూర్తి అయ్యాడు. వారం దొరకని రోజుల్లోనూ, వారాల ఇళ్ళలో ఏమైనా ఇబ్బందులు వచ్చి 'నాస్తి' అయితేనూ మా ఇంట్లో కంచం పెట్టుకునేవాడు. అదీ వాణ్ణి, నన్నూ దగ్గర చేసిన పరిస్థితి.

రామ్మూర్తి నోరూ మంచిది—మా వూరూ మంచిది కావడంతో అతని మనుగడ సాఫీగానే సాగింది. నేను కాలేజీలో చేరేను. రామ్మూర్తి ఎస్సెల్సీతో ఆపేశాడు. మా వూళ్ళోనే ఉన్న ఒక గోల్డ్ కవరింగ్ కంపెనీలో "డైలీవేజి బాయ్"గా చేరేడు. సెలవుల్లో తరుచు కలుస్తూ ఉండేవాళ్ళం. పార్కులో కూర్చుని రాత్రిళ్ళు పొద్దుపోయేదాకా కబుర్లు చెప్పుకుంటూ ఉండే వాళ్ళం. నేను రాస్తూ ఉన్న కవితలూ, కథలూ చదివి వినిపిస్తూ ఉండేవాణ్ణి.

రామ్మూర్తికి శ్రీశ్రీ అంటే పిచ్చి అభిమానం, ఆరాధనా ఉండేవి ఆ రోజుల్లో. మహాప్రస్థానాన్ని తల్లక్రిందులుగా అప్పచెప్పి ఆశ్చర్యచకితుల్ని చేసేవాడు. అతను 'జనార్దనరావుకోసం' ఖండిక చదువుతుంటే మా కళ్ళలో నీళ్ళు తిరిగేవి.

రోజులు గడుస్తున్న కొద్దీ చదువు నాలో చాలా మార్పుల్ని తెచ్చి పెట్టసాగింది. నా మాట పొంపు మారింది. రామ్మూర్తి పట్ల క్రమేపీ ఉదాసీనత పెరగడం మొదలైంది. అతన్ని తప్పించుకుని తిరిగేవాణ్ణనిపిస్తుంది నాకు—కొంచెం తీవ్రంగా ఆలోచిస్తే. అతను మాత్రం చిన్నప్పటిలాగానే కల్లా కపటం లేకుండా ఉండేవాడు. అలవాటుగా కాళ్ళు సాయంత్రాల్లో పార్కువైపు సాగినా, కావాలని దారి తప్పించి ఏ నాగేశ్వరాలయం వైపో నడిచేవాణ్ణి నేను.

నేను ముభావంగా ప్రవర్తించడం, 'నాకు దూరంగా ఉండు' అని చెప్పక చెప్పినట్లు తప్పించుకు తిరగడం త్వరలోనే గమనించాడు రామ్మూర్తి. నేను బి. ఎస్‌సి. మూడో సంవత్సరంలో ఉన్నాను. ఆ రోజు...

బాగా చీకటిపడింది. శంకరమఠం రోడ్డున వస్తుంటే ఎదురైనాడు రామ్మూర్తి. పలకరించి ఆపేడు. "అర్జంటు పనేమీ లేకపోతే పది నిమిషాలు మాట్లాడుకుందాం" అన్నాడు ప్రాధేయపూర్వకంగా.

నేను మాట్లాడలేదు. నా మౌనాన్ని అంగీకారంగా తీసుకుని, "రా. అలా వెంకటేశ్వరస్వామి గుళ్ళో కూర్చుందాం" అంటూ కదిలేడు. నేనూ అతన్ని అనుసరించాను.

ఆవరణలో గచ్చుమీద కూర్చున్నాం. క్షణాలు నిమిషాలై దొర్లిపోతున్నాయి.

జుట్టులోకి వేళ్ళు జొనిపి తీసి, అరచేతో తుడిచేసుకున్నాడు రామ్మూర్తి. ఏదైనా ఇబ్బంది కలిగించే విషయాలు మాట్లాడడానికి ముందు అతను అలా చేయడం నాకు తెలుసు. గచ్చు మీద కుడిచేతి చూపుడువేలితో శ్రీ శ్రీ శ్రీ శ్రీ అని రాసుకుపోతూ తలెత్తి నా కళ్ళలోకి చూసేడు. నెమ్మదిగా మొదలెట్టాడు.

"నీకు నేను ఇబ్బందిగా తయారైన సంగతి నాకూ తెలుసు." ఆగేడు. "చ...చ... అదేం లేదు" అన్నాను పొడిపొడిగా. నా మాట నాకే పేలవం అనిపించింది.

"నన్ను చెప్పనీ. నువ్వు పెద్ద చదువులోకి వచ్చావ్. కాస్త కూస్త ఉన్నవాడి క్రిందా లెక్కే. కథలూ, కవిత్వమూ వ్రాస్తావ్. నాలాంటి 'మీనియల్' నీ ఫ్రెండని చెప్పుకోవడం నీకు నామోషి అని నాకూ తెలుసు. కానీ, రాజా, అన్నం ముందు కూచుంటే ముద్ద ఎక్కడం లేదు. నానుంచీ దూరమైపోతూ నువ్వు చెడు తిరుగుళ్ళకీ, ఇతర వ్యసనాలకీ దగ్గర కావడం చూస్తుంటే నాకు చాలా బాధ కలుగుతోంది."

నేను తల వంచుకున్నాను. ఏదో చెప్పబోయేను. అంతలో అతనే అన్నాడు మళ్ళీ—"ఇవన్నీ నా కెట్లా తెలుసా అని ఆలోచించకు. కాలేజీలో చదివే వాళ్ళలో రాజు ఒక్కడే కాదు రామ్మూర్తికి మిత్రుడు!"

నివ్వెరపోయాను. ఆలోచనలో పడ్డాను.

చాలాసేపు ఇద్దరమూ మౌనంలో పడిపోయాము.

రామ్మూర్తి లేచి కాసేపు పచార్లు చేశాడు. నిమ్మళంగా కదిలేను నేను. గుడి ముఖద్వారం దాటుతుండగా భుజం మీద చెయ్యివేసి "ఆదివారం నీ పెళ్ళి చూపులకి నేనూ విజయవాడ వస్తున్నాను" అంటూ గబగబా వెళ్ళిపోయాడు రామ్మూర్తి!

నేను వూపిరి విడవడం ఆపేశాను!

# యువత

## మీ సాహితీ సంపద

నిర్వహణ : మంజుశ్రీ

### గత సంచికలో ఇచ్చిన సాహితీ సంపద సమాధానాలు

1. తాళ్ళూరి నారాయణకవి.
2. మల్లాది రామకృష్ణశాస్త్రి.
3. ముద్దు పళని.
4. క్రీడాభిరామం.
5. పాండురంగ మహాత్మ్యం
6. తెలుగు దేశంలో అచలయోగాన్ని ప్రచారం చేసిన మహానుభావుడు. మాలపల్లి నవలలో.
7. విశ్వదాభిరామ వినురవేమ (వేమన ) అనే గ్రంథం. త్రిపురనేని వేంకటేశ్వరరావు.
8. ఆచంట లక్ష్మీపతి.
9. మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి.
10. రాజమహేంద్రవరం.

## 10

### ప్రశ్నలు

1. "వగపేటికి జలకమాడ వచ్చిన చోటన్" అని ఎవరు, ఎవరిని, ఎందుకు దెప్పి పొడవాల్సి వచ్చింది?
2. తిక్కన మహాకవి ఇంటిపేరు!
3. ఒక మహాకవి ఇంకొక మహాకవికి ఒక గొప్ప కథా కావ్యం అంకితం ఇచ్చాడు భారత రచన కాలంలో! ఎవరు వాళ్ళు?
4. మహాభారతం చివరి పర్వం పేరుతో కావ్యం రాసిన ఆధునిక మహాకవి?
5. "తెరతీయగరాదా?!" అని ఎవరు, ఎవరిని అర్థించారు?
6. క్షేత్రయ్య పదాలు ఎవరి ముద్రతో ఉంటాయి?
7. మంగళగిరికి అరవపేరు తెలుసా?
8. పోతన మహాకవి నివాసస్థానం వోరుగల్లు కాదు—ఒంటిమిట్ట అన్న వివాదం లేవనెత్తింది ఎవరు?
9. మాంచాల ఎవరు?
10. నాగార్జునసాగరం అనే గేయ కావ్యరచన ద్వారా ప్రసిద్ధుడైన ఆధునిక కవి?

**సమాధానాలు వచ్చే సంచికలో**

ఆదివారం వచ్చింది.

నేనూ, మా బాబాయీ, పిన్నీ పిల్లని చూసేందుకు విజయవాడ వెళ్ళేము. మాతో రామ్మూర్తి వచ్చాడు. అతనికి ఈ విషయం మా పిన్ని చెప్పినట్టు, ఆమె, మా బాబాయీ అతన్ని రమ్మన్నట్టు మాటల ధోరణిలో తెలుసుకన్నాను.

ఆ రాత్రికే మళ్ళీ బందరు వచ్చేశాము. పిల్ల నచ్చలేదు.

తర్వాత, పది పదిహేను రోజుల్లోపలే మేము దక్షిణ దేశ యాత్రకి వెళ్ళాము. తిరిగి వచ్చేసరికి రామ్మూర్తి బందరు వదిలేసి వెళ్ళిపోయిన వైనం తెలిసింది. ఉన్న ఆ చారెడు కొంపా అమ్మేసి పోయాడట. మా మిత్ర బృందంలో ఉన్న విశ్వేశ్వరావూ, సాంబాబూ, రామారావూ ఈ విషయం చెప్పి, తాను వెళ్ళేటప్పుడు నేను లేనందుకు రామ్మూర్తి చాలా చాలా నొచ్చుకున్నట్టు చెప్పేరు.

నా డిగ్రీ అయిపోయింది. విజయనగరం అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాను. ఉద్యోగికి దూరభూమి లేదన్నట్టు అక్కడక్కడా తిరిగి తిరిగి హైదరాబాద్ చేరాను.

ఇన్నాళ్ళకి మళ్ళీ రామ్మూర్తిని కలవడం—అందునా ఇంత పచ్చ పచ్చగా...

ఈ ఆలోచనలతోనే తెల్లవారింది నాకు.

నాలుగు రోజుల తర్వాత—

కోఠీ దవాఖానా బస్‌స్టేప్‌లో బస్‌కోసం నిలబడి ఉన్నాను. కారుని నా పక్కగా తీసుకువచ్చి ఆపాడు రామ్మూర్తి.

ఇంటికి తీసుకు వెళ్ళాడు. అత నప్పుడు చాలా తీరుబడిగా ఉన్నాడట.

చాలా అందమైన ఇల్లు. కాంపౌండు గేటు నుంచి పోర్టికో వరకూ తెల్ల సున్నం కొట్టిన ఇటుక రాళ్ళ వరుస మధ్యగా గచ్చు చేసిన చప్టా. దానికి అటూ ఇటూ క్రోటన్లు, రకరకాల పూల మొక్కలు. అక్కడొకటి అక్కడొకటి పోకచెట్లు. మొత్తానికి ఖరీదైన భవంతి—అందమైన ఆవరణ.

హాల్లో కూర్చున్నాం.

బందరు గురించీ, అప్పట్లో మా మిత్రుల గురించీ అడిగేడు రామ్మూర్తి. హాల్లో ఉన్న విలువైన టేప్ రికార్డర్‌నీ, టి. వి. సెట్‌నీ పరికించి చూస్తూ సమాధానాలు చెపుతున్నాను.

వయస్సు మళ్ళిన ఆడావిడ ఎవరో కాఫీలు పెట్టి వెళ్ళింది.

రామ్మూర్తి ఠక్కున కుర్చీలోంచి లేచాడు. 'వన్ మినిట్' అంటూ లోపలికి వెళ్ళాడు. మరుక్షణంలోనే తిరిగి హాల్లోకి వచ్చాడు. కాఫీ సిప్ చేస్తూ నా గురించి వివరా లడిగాడు.

గోడలకు తగిలించిన తైల వర్ణ చిత్రాల్ని చూస్తూ చెప్పేను. ప్రభుత్వ రంగంలోని ఒక కంపెనీలో క్రింది తరగతి గుమాస్తా ఉద్యోగం—పెళ్ళాం, ఇద్దరు పిల్లలు—కొత్తగా వచ్చిన బదిలీ.

ప్రసంగవశాన బాబాయీ, పిన్నీ గురించి అడిగాడు. వాళ్ళిద్దరూ కాలం చేసిన సంగతి చెప్పినప్పుడు ఎంతో బాధ పడ్డాడు రామ్మూర్తి. బందరులో ఉన్న కొద్దిపాటి ఇల్లూ, ఆస్తీ కూడా అమ్మేసినట్లు చెప్పేను. ఏదో ఆలోచిస్తూ కొన్ని క్షణాలు మౌనం వహించాడు.

అప్పుడు హాల్లోకి ఆమె వచ్చింది. రామ్మూర్తి పరిచయం చేశాడు. "మా ఆవిడ. ఇందిర, గుర్తు పట్టేవా?" నమస్కారా లైనాయి. ఆమెకేసి తేరిపార చూశాను.

"గుర్తు లేదు కదూ?" మళ్ళీ అడిగాడు రామ్మూర్తి.

ఉలిక్కిపడి స్పృహలో కొచ్చాను. మరుక్షణంలోనే అర్థమైంది. మళ్ళీ ఆమెకేసి చూశాను. అవును—ఇందిర! విజయవాడలో నేను చూసిన అమ్మాయి!

వాళ్ళిద్దరూ చిరునవ్వులు చిందిస్తూ, "అవును" అన్నట్టు నా కేసి చూశారు. నేను చూపులు మరల్చుకున్నాను. గోడమీద చిత్రం—సతీదేవిని భుజాన వేసుకుని శివుడు కొండల మీంచి వస్తున్నాడు. ఒక మూల గోడవారగా వీణ పెట్టె!

నా కళ్ళ ముందు కోటి సుందర దృశ్యాలూ, నా చెవుల్లో శతకోటి రాగతరంగిణులూ సాగిపోతున్నాయి. సిరి, సంపద మనుషుల్ని ఇలా ఉంచుతుంది కాబోలని పించింది. 'ఎంత అందంగా, ఆరోగ్యంగా, ఆహ్లాదకరంగా ఉంది ఇందిర!' నా మనస్సు ఆశ్చర్య పడు



తూంది. అంతలోనే అంతా అయోమయమని పిస్తోంది.

"రాజుకి ఫ్రిజ్‌లో ఉంచిన అమృతపాణీలు చాలా ఇష్టం. తీసుకురా, ఇందిరా." రామ్మూర్తి చెప్పాడు. ఇందిర లోపలికి వెళ్ళింది.

రామ్మూర్తి సన్నగా చెప్పసాగాడు—"ఆ రోజు నీతో పిల్లని చూడటానికి రావడం నా జీవితంలో గొప్ప మలుపు, రాజా. మీ రా సంబంధాన్ని వదిలేసుకోవడం...ఇందిర కుంటి పిల్ల అని..."

ఇందిర లోపలికి రావడంతో ఠక్కున ఆపేశాడు రామ్మూర్తి.

ఆమె పండ్లు తెచ్చి టీపాయ్ మీద ఉంచి సోఫాలో కూర్చుంది. "తీసుకోండి" అంది. యాంత్రికంగా తీసుకున్నాను.

"ఇప్పుడు అందరం కలిశాం కనక పిల్లలతో రండి ఒకసారి. మా వెళ్ళెల్నీ చూస్తాను."

తలెత్తి ఆమె కేసి చూశాను. ఇందిర ముఖం పద్మంలా ఉంది. ఎంత ప్రసన్నత! ఎంత స్వచ్ఛత!

"అలాగే!"

రామ్మూర్తీ, ఇందిరా చాలా చనువుగా ఏవేవో మాట్లాడుతున్నారు. నేను పొడిపొడి సమాధానాలు చెబుతూ కూర్చున్నాను. మనస్సు చాలా పరధ్యానంగా ఉంది.

ఆ తరవాత ఒక అర గంటకి డ్రైవర్నిచ్చి పంపాడు నన్ను. ఇందిర గురించీ, తమ పెళ్ళి గురించీ పూర్తిగా మాట్లాడడానికి రామ్మూర్తికి వీలు కాలేదని అర్థం చేసుకున్నాను.

ఇంటికి రాగానే నాకు తెలీకుండానే నాలో చాలా రకాలైన మార్పులు ప్రవేశించినాయి. ఇల్లంతా చాలా ఇరుగ్గా అనిపించింది. ప్రపంచంలో ఉన్న దైన్యమూ, పేదరికమూ అంతా మా ఇంట్లోనే ముద్ద కట్టినట్లు తోచింది. అనాకారితనానికీ, అనారోగ్యానికీ ప్రతి రూపం అన్నట్లు కనపడింది నా భార్య రజని. జీవితం మీద చిరాకూ, విరక్తి కలిగాయి.

రజనీ, పిల్లలూ నా ప్రవర్తన అర్థంకాక, సర్కస్‌లో బఫూన్‌ని చూసినట్లు చూడసాగారు నన్ను.

నాలుగు రోజుల తరవాత...

రామ్మూర్తి నుంచి ఉత్తరం వచ్చింది. చదువుకున్నాను.

"ఆ రోజు మా పెళ్ళి గురించి నీకు పూర్తిగా చెప్పలేక పోయాను. అందుకే ఈ జాబు. ఇందిరకి కాలు వంకర అని నువ్వు గేలి చేసి పిల్ల నచ్చ లేదన్నావు. మీ పిన్నీ, బాబాయీ ఇందిర తండ్రి తనకు ఇల్లరికపు టల్లుడు కావాలన్నాడని ఆ సంబంధాన్ని సుతరామూ ఆలోచించేది లేదని వదిలేశారు.

మీరు ఎక్కడ ఆగిపోయారో అక్కణ్ణుంచీ నేను నడవడం మొదలెట్టాను. తెగించి ఒక్క అడుగు ముందుకు వేశాను. ధైర్యంగా నా పరిస్థితి నంతా ఇందిర తండ్రికి చెప్పాను. అంతే. మా పెళ్ళి జరిగి పోయింది. ఆ తరవాత అంతా అదృష్టం కలిసొచ్చిందన్నారు. ఆయన ఆస్తికి నా కృషి తోడ్పడిం దనుకుంటా న్నేను. అంతస్తూ, ఆనందం పెరిగాయి.

నే నేదో ఆదర్శవంతమైన పని చేశానని కానీ, త్యాగంతో ఇందిరని పెళ్ళాడానని కానీ ఎన్నడూ అనుకోను నేను. అప్పటి నా పరిస్థితి నా చేత అలా అడుగు ముందుకు వేయించింది. అంతే. ఆకలి చేస్తున్న రొద నా కా తెగింపు నిచ్చింది.

ఒక్క మాట. 'రాజుని చూసిన కళ్ళతో...' అన్న సామెతగా నా ఐశ్వర్యాన్నీ, అంతస్తునీ చూసి నాతో నిన్ను పోల్చుకోకు. అలాగే మరో రిక్వెస్ట్. నీ భార్యలో ఇందిర అదృష్టాన్ని వెతుక్కోకు. నాణానికి రెండో వైపు ఎప్పుడూ ఉంటుంది. కొన్ని సౌభాగ్యాల్ని అంటి పెట్టుకుని దురదృష్టమూ ఉంటుంది. ఇందిరకు పిల్లలంటే ప్రాణం. పిల్లల్ని తీసుకుని తప్పకుండా వస్తావు కదూ?"

మొహాన చళ్ళున చన్నీళ్ళు చల్లినట్లయింది.

రామ్మూర్తి ఉత్తరం రాయకుండా ఉంటే నేను చీకట్లో ఎంత కాలం తడుముకుంటూ ఉండాల్సి వచ్చేదో!

మిత్రుడే కాదు రామ్మూర్తి—గొప్ప పరోపకారి కూడా!

*


## 60 రోజుల్లో ఇంగ్లీషు భాష

**రచన : డి. వి. ఎస్ ఆర్. మూర్తి**

**(386 పేజీలు – వారపత్రికల సైజు)**

**వెల : రు 21-00**

( త్వరగా, సులభంగా ఇంగ్లీషు మాట్లాడడం, వ్రాయడం నేర్పే పుస్తకం )

## శ్రీ భగవద్గీత రు. 5-00

**వ్యాఖ్యాత :**

**శ్రీ వెంపటి లక్ష్మీనారాయణశాస్త్రి**

( ఇందు— భగవద్గీతతో బాటు హనుమాన్ చాలీసా, శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం, శ్రీ వేంకటేశ్వర స్తోత్రం, శ్రీ వేంకటేశ్వర ప్రపత్తి, శ్రీ వేంకటేశ్వర మంగళాశాసనము శ్లో॥ తాత్పర్యముతో గలవు.)

అన్ని పుస్తకాల షాపులలోనూ దొరుకుతాయి. లేదా పుస్తకం వెలలో ఒక రూపాయి తగ్గించి **M.O.** చేస్తే ఆ రూపాయికి **V.P.P.** పంపుతాము.

## క్వాలిటీ పబ్లిషర్స్,

**రామమందిరం వీధి, విజయవాడ-2.**

## వివాహమైనవారలకు మాత్రం

మదనానైట్ పిల్స్ ఈ నైట్‌పిల్స్ కావలసిన రోజులలో ఉపయోగించి శరీరమున ఏర్పడు బలహీనమును మార్చి వెంటనే స్ఖలనమగుటను పోగొట్టి, శరీర బలమును, ధైర్యమును పొందవచ్చును. తినిన 2 గంటలలో గుణమిచ్చునని ఉపయోగించిన వారు చెప్పుచున్నారు. మీరున్న దీని గుణాన్ని కోరితే ఈరోజే తీసి, ఉపయోగించి చూడండి. 20 పిల్స్ కొన్న బుడ్డి 1 కి రూ. 20—00, తపాలా ఖర్చు అదనం. ఆశ వుండియు, ఆశను పూర్తి చేయలేని వారలకు నివారణమిచ్చును.

## వాయువు లేహ్యం

మలబద్ధకం పోగొట్టును. అనేక వాయువులను ప్రత్తివలె ఎగరగొట్టును. ఆకలిలేక మందమై, రొమ్ము నొప్పి, ఉష్ణవాయువు అధికమై మలం గట్టిపడి గాలి బయట రాలేక అపానవాయువు పైకెక్కుట వలన శరీరమున రెండు ప్రక్కలను, రొమ్మున, వీపున చురుక్కుని కుట్టే వాయువు బాధలను పోగొట్టి మిగతా వాయువులను నివారించును. పథ్యములేదు. పెద్ద టిన్ 1 కి రూ. 15—00. చిన్నటిన్ 1 కి రూ. 11—00. పోస్టేజి అదనం. వి. పి. పి. కలదు. కావలసిన వ్రాయండి.

**SARAVANA MEDICAL HALL (WAP)**
**Post Box No. 109,**
**453, Main Road, Salem-636 001**